క్లుప్తంగా

26న ఉచిత వైద్య శిబిరం

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 26వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. డీఎస్‌ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ తిరుపతి ఆధ్వర్యంలో గుండె, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1,488 క్వింటాళ్ల విత్తన కాయల పంపిణీ


పాపిరెడ్డిపల్లెలో విత్తన కాయలు పంపిణీలో పాల్గొన్న ఏడీ సౌభాగ్యలక్ష్మి, ఏఓ వందన

గంగాధరనెల్లూరు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా 3,906 మంది రైతులకు 1,488 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేశామని నగరి ఏడీ సౌభాగ్య లక్ష్మి తెలిపారు. మండలంలో గంగాధరనెల్లూరు, పాపిరెడ్డిపల్లె, నెల్లేపల్లె, వేల్కూరు గ్రామాల్లో వేరుశనగ విత్తనకాయల పంపిణీని ఏడీ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ అధికారి వందన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మకు అభిషేకం

శ్రీ రంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లెలో ఉన్న ఆరిమాను గంగమ్మకు ఘనంగా అభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి గెలుపొందాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా చొక్కా గోవిందయ్య మాట్లాడుతూ సంవృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ సుభిక్షంగా ఉండాలంటే జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కటిక పల్లి సర్పంచ్ మార్కొండయ్య, శరత్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాటిళ్లలో పెట్రోలు నింపితే చర్యలు


దుకాణ యజమాని సోనియాకు నోటీసు అందజేస్తున్న అధికారులు

వెదురుకుప్పం: బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ నింపితే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లంలోని పెట్రోలు బంక్‌ను పరిశీలించి, నోటీసులిచ్చారు. అక్కడ సిబ్బందితో మాట్లాడుతూ విడివిడిగా ఆయిల్ ఫిల్లింగ్ చేయకూడదన్నారు. వాహనాలకు మాత్రమే ఆయిల్ నింపాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే బంక్‌లను సీజ్‌చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సద్దికూళ్లపల్లె ఆదిఆంధ్రవాడ, పచ్చికాపల్లం సచివాలయ పరిధిలో దుకాణాల్లో పెట్రోలు అమ్ముతున్న వ్యాపారులకు నోటీసులిచ్చి, హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు ఎక్కడా పెట్రోల్ విక్రయించకూడదని సూచించారు. ఎక్కడైనా అమ్మితే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధూజ, వెల్ఫేర్ అసిస్టెంట్ సుదర్శన్ ఉన్నారు.

వినాయక మండపం పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న పాలక మండలి చైర్మన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరి వద్ద చేపట్టిన వినాయక మండప పనులను శుక్రవారం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విజ్ఞాన గిరి వద్ద ఉన్న వినాయక మండపం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కోసం రూ.10లక్షల వ్యయంతో పాలకమండలిలో తీర్మానం చేసి పనులు ప్రారంభించామన్నారు. రాబోయే కుమారస్వామి బ్రహ్మోత్సవాల్లోపు పూర్తి చేస్తామన్నారు. కుమారస్వామి కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. శ్రీనివాసులు, కంఠా ఉదయ్‌కుమార్, అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, బాలాజీ, కాంట్రాక్టర్ గుమ్మడి బాలకృష్ణయ్య పాల్గొన్నారు.

పోలీసుల నాకాబందీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని బృందమ్మ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు నాకాబందీ నిర్వహించారు. డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కాలనీలో ఈ తనిఖీలు చేశారు. రికార్డులు లేని 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

తొలకరి కాలం.. వ్యాధుల గాలం

- జాగ్రత్తలతో నయం
- ముందుగానే టీకాలు వేయించాలని సూచనలు

తొలకరి చినుకులు పడుతున్నాయంటేనే పాడి రైతులు గజగజలాడాల్సి వస్తుంది. దీనంతటికి కారణం పాడి పశువులకు సోకే వ్యాధులే కారణం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించి, టీకాలు వేయిస్తే మంచి ఫలితం ఉంటుంది. అలాగే జాగ్రత్తలు పాటించడంతోనూ వ్యాధుల నివారణకు అవకాశం ఉంది.


పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్య సిబ్బంది


గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

కార్వేటినగరం: వర్షాకాలం వస్తుందంటే రైతుల్లో ఆందోళన, గుబులు పుట్టుకొస్తుంది. ముఖ్యంగా ప్రస్తుతం తొలకరి వానలు కురుస్తుండడంతో పశువులకు సోకే వ్యాధులపై పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని రైతులు వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పంట సాగులో నష్టం వచ్చినా, కరువు కమ్ముకొచ్చినా కలిగే లోటును పాడి పరిశ్రమతో పూడ్చుకుని, జీవనం సాగిస్తున్నారు. అలాంటి ప్రధాన ఆధారమైన పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వర్షాకాంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, చిటుక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులు జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ తొలకరి సమయంలోనే అధికంగా వ్యాప్తి చెందుతుంటాయి. ఈ వ్యాధులు సోకితే పాల దిగుబడి తగ్గడంతోపాటు పశువులు మరణించే ప్రమాదం ఉంది. దీంతో పాడిరైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. వర్షాకాలంలో కలుషితమైన నీరు, మేత కారణంగా పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గి పలు వ్యాధులు సంక్రమిస్తుంటాయి. పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. కార్వేటినగరం మండలంలో గేదెలు 1,233 ఆవులు 4,290, గొర్రెలు, మేకలు 1,569 వరకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధుల నివారణపై అధికారులు పాడిరైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

టీకాలు తప్పనిసరి

పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించాలి. కొందరు రైతులు పాడి దిగుబడి తగ్గిపోతుందని టీకాలు వేయించడానికి వెనకడుగు వేస్తారు. టీకాలు వేయడంతో పాల దిగుబడి తగ్గిపోతుందన్నడం ఓ అపోహ మాత్రమే. అలాంటిదేమీ జరగదు. కాగా అలా చేయడం కూడా సరైన పద్ధతి కాదు. వ్యాధులు ముసిరి పశువులు మరణించి నష్టపోవడం కన్నా ముందస్తు టీకాలు వేయిస్తే వ్యాధులు సోకకుండా నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా గొంతువాపు వ్యాధి సోకుతుంది. దీన్నే గురకవ్యాధి అని కూడా అంటారు. వర్షాకాలంలో గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడల్లో ఎక్కువగా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఒక్కోసారి గొర్రెలు, మేకలు, పందుల్లో కూడా వ్యాపిస్తుంటుంది. ఇది అంటువ్యాధి. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతూ గురక, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. జ్వర తీవ్రత 106, 107 డిగ్రీల వరకూ ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో పశువులు మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

నివారణ చర్యలివీ..

వర్షాకాలానికి ముందే జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి సోకిన పశువుల దొడ్డిని ఫినాయిల్, క్రిసాల్ వంటి క్రిమి సంహారక ద్రావణంతో పరిశుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. తప్పనిసరిగా పశువైద్యాధికారిని సంప్రదించి, వైద్యం చేయించాలి.

గాలికుంటు వ్యాధి

కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తల్లి పాలు ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షాకాలంలో గేదెలు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికీ ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి.

నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ ఫౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు మందు ద్రావణంతో శుభ్రం చేసి, వేపనూనె రాయాలి. యాటిబయాటిక్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన


రైతులకు వేరుశనగ విత్తన కాయలను అందజేస్తున్న ఏ నర్మద

శ్రీరంగరాజపురం: మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో రాయితీ వేరుశనగ విత్తన కాయల పంపిణీకి సంబంధించిన పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఏఓ నర్మద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో వేరుశనగ విత్తన కాయలు 30 కిలోల బస్తా రూ.1,710 ధరకు అందించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే వేరుశనగ కాయలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం తయ్యూరు రైతుభరోసా కేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జోత్స్న, అసిస్టెంట్ శివకుమార్, వీఆర్వో చంద్రబాబు, సచివాలయం సిబ్బంది ఉమ, ఉషా, జగదీష్, కుమార్, బిందుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ గోడౌన్ తనిఖీ

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ ఎఫ్‌సీఐ గోడౌన్‌ను శుక్రవారం ఆర్డీఓ చిన్నయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో స్టాకును తనిఖీలు చేశారు. సరుకు నిల్వ రికార్డులను తనిఖీ చేశారు. గోడౌన్‌లో స్టాకు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రవి, డీటీలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడికి నివాళి


మృతదేహానికి పూలమాల వేసి కన్నీటి పర్యంతమవుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


ఎన్నికల ప్రచారంలో ద్విచక్ర వాహనంపై డిప్యూటీ సీఎం నారాయణస్వామితో మృతుడు(ఫైల్)

పాలసముద్రం: డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు చంద్రశేఖర్‌రాజు మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. మండలంలోని రాచపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చంద్రశేఖర్ రాజు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు అన్బులగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తులసి యాదవ్‌తో కలసి రాచపాళేనికి చేరుకుని చంద్రశేఖర్‌రాజు భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి కన్నీటి పర్యంతమయ్యారు. వారి కుటుంబాన్ని ఓదార్చి, అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రశేఖర్ రాజు అంకిత భావంతో వైఎస్సార్ సీపీ విజయం కోసం తనతో కలసి ఎన్నికల ప్రచారం చేపట్టారన్నారు. వాహనాలు వెళ్లలేని గ్రామాలకు కూడా ఆయన ద్విచక్రవాహనంలో తనని తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మహేష్, అయ్యప్ప, రైతు భరోసా కేంద్రం చైర్మన్ పోలయ్య, పెనుమూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమాదేవి, నాయకులు సుబ్రమణ్యరెడ్డి, సుందరరాజు, సుమన్, ధనుంజయులు పాల్గొన్నారు.

అశ్విన్ కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అశ్విన్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం పరామర్శించారు. ఎస్‌ఆర్‌పురం మండలంలోని చొక్కమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు అశ్విన్ కుమార్‌రెడ్డి (37) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడే ఉంటున్నారు. అయితే కుటుంబ కలహాలతో అతడు హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ తరుపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మణి, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సిద్దయ్య, మాజీ సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, నాయకులు శీనయ్య, జనార్దన్, లోకనాథరాజు, కాళప్ప, బాబు, రాజా, అల్లిముత్తు తదితరులు అశ్విన్‌కు నివాళులర్పించారు.

ఉచిత నీటి, మట్టి నమూనా పరీక్షలు

పిచ్చాటూరు: మండలంలోని తులసిక్రిష్టాపురంలో శుక్రవారం ఉచిత నీటి, మట్టి నమూనా పరీక్షలను వ్యవసాయ నిపుణులు చేపట్టారు. ఈ సందర్భంగా మట్టి నమూనా అధికారి ఉమామహేశ్వర రెడ్డి మాట్లాడుతూ తులసిక్రిష్టాపురంలో 30 మట్టి నమూనాలు, 4 నీటి నమూనా పరీక్షలు నిర్వహించి ఆయా భూముల్లో నేలసారాన్ని బట్టి ఎరువుల వాడకంపై రైతులకు సూచనలు చేసినట్టు తెలిపారు. శనివారం కేవీబీ పురం మండలం ఆరె గ్రామంలో నీటి, మట్టి, నమూనా పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు వివరించారు. స్పిక్, గ్రీన్ స్టార్ట్ ఫెర్టిలైజర్స్ ప్రతినిధి అరుశ్ కణ్ణన్, మార్కెటింగ్ అధికారి తిరుమల రావు, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ


సరుకు నిల్వలను సరిచూస్తున్న ఆర్డీఓ


సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్డీఓ

నగరి: పట్టణ పరిధిలోని పౌర సరఫరాల గోదామును ఆర్డీఓ వెంకటరెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం గోదాముకు సిబ్బందితోపాటు వెళ్లిన ఆయన ఆన్‌లైన్‌లో చూపుతున్న సరుకు నిల్వ, గోదాములో ఉన్న సరుకు నిల్వలను పరిశీలించారు. బియ్యం, పోర్టిఫైడ్ బియ్యం, కందిపప్పు, పామోలిన్, రాగి పిండి, గోధుమ పిండి, చక్కెర నిల్వలను విడివిడిగా లెక్కించి సరిచూశారు. సరుకుల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. చూపుతున్న నిల్వల మేరకు గోదాములో సరుకు ఉన్నట్లు తేల్చారు. సరుకులను సరైన సమయాల్లో ఆయా దుకాణాలకు సరఫరా చేయాలని గోడౌన్ డీటీకి సూచించారు. ఈ తనిఖీలో డీఎస్‌ఓ శంకరయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, గోడౌన్ ఇన్‌చార్జి పి.ఆదం పాల్గొన్నారు.

అన్నదమ్ముల్లా కలసి మెలసి ఉండాలి


బలిజకండ్రిగ దళితవాడలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ భారతి

పాలసముద్రం: గ్రామాల్లో ప్రజలు గొడవలు లేకుండా కలసి మెలసి అన్నదమ్ముల్లా ఉండాలని ఎస్‌ఐ భారతి సూచించారు. శుక్రవారం బలిజకండ్రిగ దళితవాడలోని ప్రజలతో ఆమె మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, అయితే ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు, ఆ తరువాత కూడా గ్రామాల్లో అందరు కలసి మెలసి ఉండాలని తెలిపారు. ఎన్నికలు ఫలితాలు వచ్చేవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా చిన్న చిన్న గొడలవకు కేసులు పెట్టుకుని, కోర్టు చుట్టు తిరగవద్దని తెలిపారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయం, చేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మితాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్, వైద్య పరీక్షలకు హాజరైన మహిళలు

పుత్తూరు: ప్రతి ఒక్కరూ మిత ఆహారం, క్రమం తప్పని వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని టాటా ఆసుపత్రి డాక్టర్ వెంకయ్యబాబు సూచించారు. శుక్రవారం వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురం గ్రామంలో రాస్ సేవా సంస్థ, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రత్యేకించి మహిళలు తమ దైనందిన జీవితంలో ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధ పడుతున్నారని తెలిపారు. మహిళలు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ విధిగా 45 నిమిషాలపాటు వ్యాయామం చేయాలని సూచించారు. సంవత్సరం నుంచి రాస్ సంస్థ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో 150 మందికి బీపీ, షుగర్, హెపటైటిస్, మహిళలకు గొంతు, రొమ్ము, గర్భాశయం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు అమరావతి, రెడ్డికుమారి, మహేంద్ర వైద్య సేవలందించారు. కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, రాస్ అధికారులు రవి, ప్రకాష్, మీనా, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడులో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఖాయం


తిరుపతిలో నూకతోటి రాజేష్‌తో పిచ్చాటూరు మండల నాయకులు

పిచ్చాటూరు: సత్యవేడులో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని సింగిల్ విండో చైర్మన్, ఆ పార్టీ మాజీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తిరుపతిలో వైఎస్సార్ సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌ను కలిశారు. నియోజకవర్గంలో పోలింగ్ సరళిపై రాజేష్‌తో చర్చించారు. కేటీ హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంతో పాటు నియోజకవర్గంలో మహిళలు ఎక్కువ శాతం ఓటు వేశారని తెలిపారు. సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మహిళలు వైఎస్సార్ సీపీ వైపు నిలిచారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, ఆయన సతీమణి నూకతోటి చైతన్య భానును పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. శ్యాంప్రసాద్ రెడ్డి, పిచ్చాటూరు టౌన్ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, ఎంపీటీసీ వేలు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిపిసూదన్ రావు, ఎస్‌సి, రైతు విభాగ మండల అధ్యక్షులు గోవిందన్, ఆర్‌ఎస్ రాజు, వైస్ సర్పంచ్ శెల్వ పెరుమాళ్, వైఎస్‌ఆర్‌టీయూసీ మండల అధ్యక్షుడు మునిరాజ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముద్దుక్రిష్ణమరాజు, మాజీ ఎంపీటీసీ వెంకటేశులు, నాయకులు సుమన్, శంకర్ రాజు, మణి రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సర్వభూపాల వాహనంపై కల్యాణ వెంకన్న చిద్విలాసం




కల్పవృక్ష వాహనంపై మహావిష్ణువుగా కల్యాణ వెంకన్న, సర్వభూపాల వాహన సేవ

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారు సర్వభూపాల వాహనంలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున 4 గంటలకు సుప్రభాతంతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజలు చేశారు. ఏకాంతంగా కల్యాణ వెంకన్న, పద్మావతీ అమ్మవార్ల మూలవర్లకు శుక్రవార అభిషేకాలు చేశారు. నిర్మిత హోమశాలలో ప్రత్యేక పూజలు చేసి, తొలి గంటతో దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. ఉదయం 7.30 గంటలకు స్వామి గోరక్షకునిగా చేత శంఖు చక్రాలు, విళ్లంబులతో సుగంధ పుష్ప మాలికలను, స్వర్ణాభరణాలను అలంకరించుకుని కల్పవృక్ష వాహనంపై అధిష్టించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాల మధ్య స్వామి వారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తి ఉభయ నాంచారులతో స్నపన తిరుమంజనంలో సేద తీరారు. సాయంత్రం పట్టాభిషక్తుడైన వెంకన్న రామావతారంలో ఊంజల్ సేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు సుగంధ పుష్పాలతో అలంకరించిన సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించారు. పద్మావతీ, ఆకాశరాజు సమేత శ్రీనివాసుడికి మహిళలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాలలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ కోదండరామశెట్టి తదితరులు పర్యవేక్షించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, ఏకాంత సేవను అర్చకులు నిర్వహించారు.

నేడు గరుడసేవ

ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పక్షి రాజైన గరుత్మంతుడిని వాహనంగా చేసుకుని కల్యాణ వెంకన్న భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం పల్లకిలో మోహినీ అవతారంలో స్వామి వారు ఊరేగనున్నారు. గరుడసేవ ఉత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన అధికారి నాగరాజు తెలిపారు. భక్తులు సమన్వయంతో కర్పూర హారతులను సమర్పించాలని కోరారు.


స్వామి వారి ఊరేగింపులో భక్తుల కోలాటాలు


పట్టు వస్త్రాలను తీసుకెళుతున్న ఆలయ పాలకమండలి చైర్మన్, పాలక మండలి సభ్యులు

కమనీయం.. కల్యాణం

శ్రీకాళహస్తి (తొట్టంబేడు): శ్రీకాళహస్తీశ్వరాలయం అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఇతర సభ్యులు ఆలయం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వార్ల కల్యాణ క్రతువు ఆరంభమైంది. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవోపేతంగా ముగించారు. అనుబంధాలయాల అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి, అనిల్‌కుమార్‌శర్మ, చెన్నకేశవస్వామి, శర్మ, అర్ధగిరిస్వామి పాల్గొన్నారు.